


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### అమృతం కురిసే కాలం

**ఊరగాయ అనే మాట వింటేనే** ఎవరికైనా నోరు ఊరుతుంది కదా! అలాగే తమిళనాట, ఎన్నో చప్పిడి హోటళ్ళ తిండి రుచి చూసాకా, ఒకానొక బంధువుల ఇంట "ఊరగాయ ఉంది వేత్తునా?" అన్న తమిళ యాసతో ఇంటావిడ అడగగానే, మా నాన్నగారి మొహం ఇంట్లో మందుకూరిన మతాబులా వెలిగిపోయింది.

తీరా ఆవిడ ఒక తెల్లని ముక్క కంచంలో వడ్డించి "మొగమాటం వేండ.. తినండి" అంటే అంతకన్నా తెల్లబోయిన మొహంతో నా వైపు, మా అమ్మ వైపూ చూసారు నాన్న.. తుస్సుమంది మతాబు.

ఆ ఊరగాయ అనే పదార్థంలో ఉప్పూ, పసుపూ, ఆవపిండీ తప్ప కారం అనే పదార్థం లేదు. పైగా చలివాసనొచ్చింది.

"మా అత్తమ్మ బతికున్నప్పుడు ఊరగాయ నిండా పెట్టి పూడ్చేది. ఇప్పుడు నాకు దా సెరిగా రాదు... అప్పటిదే వాడ్తా ఉండా" అందావిడ.



వాళ్ళ అత్తగారు పోయి అప్పటికి నిండా ఆరేళ్ళు. అదీ మద్రాసు మహానగరానికి మొదటిసారి, చిన్నప్పుడు మా అమ్మా, నాన్నతో వెళ్ళినప్పటి ఆతిథ్యం. అప్పట్లో బంధువుల బంధువులు ఎక్కడ ఉన్నారా అని వెతుక్కుని వెళ్ళడం తప్ప ఇప్పటిలా హోటళ్ళలో ఉండడం తెలీదనుకుంట.

ఆవకాయ మొదటిసారి ఎవడు కనిపెట్టాడో కానీ అతన్ని మనం 'ఆంధ్రపిత' అనో 'ఆవకాయ కేసరి' అనో బిరుదిచ్చి, ఇంటింటా ఫోటో పెట్టి పూజలు చేయాల్సిన వ్యక్తి. కానీ మనం ఆ విషయం పట్టించుకోలేదు. కనీసం ఆవకాయ పేటెంట్ మనదని ఎక్కడా రిజిస్టర్ చెయ్యలేదు.

అసలు ఎంత అద్భుతమైన పరిశోధనండీ, మావిడికాయలో పుల్లదనానికి, ఉప్పూ కారం కలిపి, దానికి ఘాటు పుట్టించే ఆవపిండి కలిపి, నూనెలో ముంచి జాడీల్లో పెట్టించడం. అసలు నాకైతే 'సాగరమథనం'లో కల్పవృక్షం, కామధేనువుతో బాటు ఆవకాయ జాడీకూడా బయట కొచ్చిందేమో అని అనుమానం.

మొన్న భానుమతిగారి అత్తగారి కథల్లో ఆవకాయ పెట్టే కథ చదివా! ఐదువేల కాయలు కౌలు కిచ్చిన వాడి ముక్కు పిండి వసూలు చేసి, పెద్ద పెద్ద గంగాళాలలో ఐదువందల కాయలు కొట్టి ముక్కలు పోసి, గుప్పెడు ఉప్పూ, గుప్పెడు కారం, గుప్పెడు ఆవపిండీ పోసి మహాతల్లి 'ఇంతకన్నా కారం తినలేము కమ్మగా ఉండాలి' అని వాసిన కట్టేసిందట. ఆ తరువాత అందర్నీ 'మా అత్తగారు ఆవకాయ పెట్టారు, భోజనానికి రండి" అని ఈవిడ పిలిస్తే, జాడీల మూతలు తీస్తే ఏవుంది? నల్లగా బూజొచ్చి ఉన్నాయి అన్నింటిలోనూ.

అసలు ఆవకాయ అంటే మా అమ్మమ్మ గుర్తొస్తుంది. ఎంత పెద్ద ప్రయత్నం అని. ముందుగా సన్న ఆవాలు తెచ్చి ఎండలో పెట్టి, విసిరి జల్లించి, మిరపకాయలు కొని తొడిమలు తీసి, కారం కొట్టే వాళ్ళని పిలిచి పెరట్లో కొట్టిస్తుంటే, మేము ముక్కూ, నోటా నీళ్ళు కారుతూ బయటకి పోయి తలుపులు వేసేసేవాళ్ళం. మాకారాలే కాక, మా ఫ్యామిలీ డాక్టరుగారి కారాలూ, మహారాష్ట్రాలో ఉండే పెద్దమ్మగారి కారాలూ అన్నీ మా మొహం మీదే కొట్టేవారు.

కాయలు కొనడానికి కాఫీలు తాగి మోండా మార్కెట్‌కి చీకటితో వెళ్ళేవారు అమ్మమ్మా, అమ్మా. ఇంక అక్కడ కాయలు అమ్మే పిట్టలాళ్ళు, కంట్లో కారం కొట్టేసే టైప్. వాళ్ళతో బేరాలు.

"ఇంకో చెయ్యి వెయ్యి" అనేది అమ్మమ్మ.

"అమ్మో. నాకే పడలేదు, నేను వేలేస్తా" అనేది ఆ అమ్మే అమ్మి.

ఇంతకీ చెయ్యి వెయ్యి అంటే... ఇంకో అయిదుకాయలనీ, వేలు అంటే ఒకటనీ, నాకు ఎప్పటికో కానీ అర్థం అవలేదు.

"తెల్లని గులాబీలమ్మా... మాడు చిట్లే పులుపు" అని మనకి ఒక ముక్క కోసి పెడ్తాడు. నిజంగానే పులుపు రొడ్డు అనిపిస్తుంది. తీరా తెచ్చి నాలుగు కాయలు కొట్టిస్తే సగానికి సగం తియ్యగా ఉంటాయి. అసలు కాయలు కొనే టెక్నిక్ అందరికీ అబ్బదు.

మొత్తానికి రెండొందల కాయలకి తక్కువకాకుండా కొని గంపలకెత్తించి, గంపవాడికి రెండు రూపాయలిచ్చి, కాయకి అప్పట్లో ఏ పావలానో ఉండేది ముక్క కొట్టడానికి. ముక్కలు కొట్టేవాడితో "చిన్నముక్కలు" కొట్టు. నీ కడుపు ఉడకా.. దెయ్యపు బిడ్డని కన్నట్టు అవేం ముక్కలురా?" అని తిట్టి దగ్గరుండి కొట్టించి, చెమటకి నిలువెల్లా తడిసిపోయి, ఎండకి మండిపోయి, శారదా స్టోర్స్ సందులోకి దూరి, ఎడమ పక్కకి తిరిగి ముక్కుమీదకి కళ్ళజోడు జారిపోయిన తాత దగ్గర పాల ఇంగువ కొనుక్కుని, వారింట్లో పిల్లల గురించీ మనవల గురించీ కుశల సమాచారాలు అడిగి అమ్మా, అమ్మమ్మా రిక్షాలో సికింద్రాబాదు స్టేషన్ చేరి బస్సెక్కేవాళ్ళు.

ఆవిడ ఇంటికి రాగానే, మేమంతా యుద్ధానికి సన్నద్ధమయి డాలూ, కత్తితో సిద్ధమయిన సైనికుల్లా, ఆల్చిప్పలూ, అప్పట్లో చెక్కు తియ్యడానికి పీలర్లు ఉండేవి కావు) ఎదురింటావిడ్నీ, పక్కింటావిడ్నీ అడిగి కత్తి పీటలుతో చాపలు పరిచి ఎదురు చూస్తుండేవాళ్ళం.

ముందు ముక్కలన్నీ శుభ్రంగా తుడిచి జీడి తీస్తూ "రద్దీ ముక్కలు ఉంచండ్రా.. పెసర ఆవకాయకీ, పులిహోర ఆవకాయికీ" అనేది అమ్మమ్మ.

కొన్ని ముక్కలు మా జామెంట్రీ బాక్సుల్లోకీ, జేబుల్లోకీ దూరిపోయేవి.



అమ్మమ్మ స్నానం చేసి మడికట్టుకుని, మమ్మల్ని ఆ పక్కకి రానివ్వకుండా తలుపులేసి, మూడు గుండలూ గుచ్చెత్తి, ముక్కలు గుప్పెడూ, ఈ గుండ గుప్పెడూ, మధ్యలో 'సామర్ల కోట' పప్పునూనె పోస్తూ కలుపుతూ జాడీల్లో వేస్తూ ఉంటే, మాకు కమ్మటి వాసనొచ్చేది. తలుపు సందుల్లోంచి చూస్తూ పిల్లలం "అయిపోయింది.. అయిపోయింది" అని సంబరపడేవాళ్ళం. అవన్ని శుభ్రమైన చీర చింపి వాసినలు కట్టి దేవుడి గదిలో పెట్టొచ్చి, అప్పుడింక మాగాయి కాయికి చెక్కు తియ్యడానికి కూర్చునేది అమ్మమ్మ.

మాగాయి భలే పసందుగా ఉంటుంది. మూడురోజుల తర్వాత డాబా మీద ఎండ

పెడితే, మాకు రోజూ డాబా మీదే చదువుకోవాలి అనిపించేది ఎందుకో? నేను చిన్నప్పుడు అమ్మమ్మ చూడకుండా ఊట కప్పుతో ముంచుకుని తాగేసేదాన్ని. తర్వాత గుడగుడలాడేది అనుకోండీ. అమ్మమ్మ అప్పటికీ పసుపు మరకలు అంటిన జేబులు తనిఖీలు చేసి "అడ్డమైన చేతులూ పెట్టకండర్రా...మడి!" అని అరుస్తూనే ఉండేది. మేలుకున్నంత సేపు పోలీసు కాపలా కాసేది. ఎప్పుడో పాపం ఆవిడ కన్ను అంటుకోగానే, మేము మాగాయముక్కల మీద పడేవాళ్ళం.

ఇంక మాగాయి కలిపే రోజు పప్పునూనె కాగాకా, అందులో పాల ఇంగువ వేస్తే వస్తుంది కదా మజా! వీధిలో ఉండే ప్రతి ఇంటివాళ్ళూ ముక్కులు ఎగబీల్చి 'ఇవాళా ఫలానా వాళ్ళు మాగాయి తిరగమోత పెడుతున్నారు' అనుకునేవాళ్ళు. అలా ఉండేది 'మోత'

మేమంతా వరసగా కూర్చుని చేతులు జాపేవాళ్ళం.. ఎందుకంటే అమ్మమ్మ మాగాయిలో కారం, మెంతిపిండీ కలిపి, ఈ నూనె పోసాకా, జాడికి ఎత్తి, ఆ బేసిన్లోనే అన్నం వేసి మా అందరికీ ముద్దలు కలిపి పెట్టేది. ఒక్కో ముద్దకీ స్వర్గం అంచు వరకూ వెళ్ళి తిరిగి వచ్చేవాళ్ళం. ముక్కుమీద కారుతున్న చెమట్లు తుడుచుకుంటూ మాగాయి అన్నం ముద్దలు తినేవాళ్ళం.

"మజ్జిగ తాగండర్రా భడవల్లారా వేడి చేస్తుంది" అని దబ్బాకు వేసిన మజ్జిగ ఇచ్చేది అమ్మమ్మ.

హూ! పొద్దుటి పూట స్కూలుకి వెళ్ళేముందు తరవాణీ అన్నంలో ఈ కొత్తావకాయి ముక్క వేసుకుని తింటుంటే ఎంత బావుండేదనీ.

దబ్బాకుల కోసం చిట్టెత్తయ్యగారి ఇంటికి వెళ్ళేవాళ్ళం. అదే నా కొంపకి కప్పేసింది. .. ఆ పక్కింట్లో మా ఆయనా (అప్పటికి కాదులెండి, నాకు పదేళ్ళే) వాళ్ళు ఉండేవాళ్ళు. ముళ్ళు గుచ్చుకోకుండా దబ్బాకులు కోసుకొచ్చి అమ్మమ్మకిచ్చేవాళ్ళం. ఈ దబ్బాకులు నాగ్‌పూర్‌కి కూడా ఎక్స్‌పోర్ట్ అయ్యేవి. పెద్దమ్మ ఎండపెట్టి తీసుకెళ్ళేది.

మా పక్కింట్లో మాధవి అనే చిన్నపిల్ల ఉండేది. అది మా చెట్టు బంగినపల్లి మావిడికాయలన్నీ కోసుకునేది. మేం కోసుకుంటుంటే, అది బాధపడ్తూ "రమణక్కా.. చెట్టు మొదలు పొరపాటున మీ వైపు పెట్టి గోడ కట్టారు. కానీ అది మా చెట్టే, మా నానమ్మ చెప్పింది" అనేది.

అది చెప్పిన ఆ జీవన సత్యం ఇప్పుడు మేం పక్కవాళ్ళ చెట్టు కాయలతో దొంగ మాగాయ పెట్టుకొన్నప్పుడు పనికొస్తోంది.

ఇక్కడితో ఆవకాయ ప్రహసనం అయిందనుకోకండి. పెసర ఆవకాయా, నువ్వుఆవకాయా, నీటి ఆవకాయా, పులిహోర ఆవకాయా, బెల్లం ఆవకాయా, ఎండావకాయా, వెల్లుల్లి ఆవకాయాలాంటి చిల్లర దేవుళ్ళు చిన్న చిన్న జాడీలలో వెలిసేవారు. అసలైన మూల విరాట్టులు మాత్రం పీట మీద దేవుడింట్లో కొలువై యుండేవారు.

వరలక్ష్మత్తయ్య మాత్రం తెలివైనది స్టీలు ఐస్‌క్రీం కప్పుల్లో (లోతు ఎక్కువ ఉండదుగా) ఆవకాయా, మాగాయా శాంపిల్స్ తెచ్చి ఇచ్చేది. మా అమ్మకి అప్పట్లో అసలు ఇలాంటివి తెలీదు. పెద్ద పెద్ద కప్పులనిండా పెట్టి అందరికీ ఇచ్చేది. ఇది చాలదన్నట్లు "ఆఫీసులో బషీర్ కివ్వాలే, రోజీకి ఇవ్వాలే.. వాళ్ళకి చాతకాదు. అలాగే మంగపతికీ మా ఆఫీసర్‌గారికీ, సూపర్‌వైజర్ గారికీ" అంటూ బోలెడు హార్లిక్స్ సీసాలు నింపి ఇచ్చి వస్తూ ఉండేది.

మధ్యాహ్నాలు లంచ్ టైంలో కొందరు బ్రహ్మచారులు అమ్మ లంచ్‌కొచ్చినప్పుడొచ్చి "కాస్త పచ్చడి ముక్క పెట్టక్కా" అని అడిగి వేయించుకునేవారు.

"అక్కా.. పెచ్చడి.." అని అడిగి తిన్న ఓ వ్యక్తి (ఆర్.టి.సిలో రికార్డ్ ట్రేసర్‌గా జాబు చేసేవాడు) ఇప్పుడు సరస్వతీ ఉపాసకుడూ, సంఖ్యా శాస్త్రజ్ఞుడూ అయి నగరంలో ఏ కార్యక్రమం జరిగినా వేదిక ఎక్కేస్తుంటాడు. తలుచుకుంటుంటే ఆశ్చర్యంగా ఉంటుంది.

ప్రతిపూటా ఇలా ఎవరింటి నుండో ఒకరింటినుండి శాంపిల్స్ వచ్చి మా ఆవకాయ మేం తినడానికుండేది కాదు. రాత్రిపూట అమ్మమ్మ వెన్నపూస తీసి ఆవకాయలో నంజుకోడానికి వేసేది మాకు.

"ఇవటూరి వాళ్ళ దాంట్లో కాస్త ఉప్పు తగ్గింది. చెరుకుపల్లి వాళ్ళ కాయ పులుపు లేదు. అడవి వారిది బావుంది" ఇలా అనుకుంటూ తినేవాళ్ళం. ఏప్రిల్, మే నెలలు ఆవకాయ పనులతో, రుచులు చూడడాలతో గడిచిపోయేది.

ఓసారి సెలవలకి రైల్లో నాగ్‌పూర్ వెళ్తుంటే, మా అన్నయ్య చెంపల నుండి రక్తం కారడం చూసి, అమ్మమ్మ బేజారెత్తి రైలు గొలుసులు లాగుదాం అనుకుంది. కానీ నిద్రలోంచి లేచినవాడు, "నాకేం కాలేదే?" అన్నాడు.

అది బెర్తుమీదున్న ఆవకాయ జాడీ పగిలి కారుతున్న నూనె అని తర్వాత తెలిసింది.

మా పెళ్ళైన కొత్తల్లో ఇంటావిడ 'నేను ఆవకాయ పెట్టడంలో ఘనాపాఠిని' అంది. మూడోనాడు ఆవపిండి తక్కువైంది. ఉప్పు పంటికి తగుల్తుంది అని ఆవపిండీ, తర్వాత రోజు కారం, ఇంకో రోజు నూనె, మరీ చారు చారు అయిపోయిందని మళ్ళీ ముక్కలు ఇలావేస్తూ వచ్చి పదోనాడు బూజొచ్చి గోడ వెనకాల పారేసింది.

ఇంకో ఆవిడ పాపం ఆవాలు గిర్నీలో ఆడించిందట. వాడు మినప్పిండి ఆడి, ఆవాలు వేసాడుట. ఆవిడ ఆవకాయ అప్పడాల పిండిలా సాగడం మొదలైంది.

మా అత్తగారు ఆవకాయ చాలా బాగా పెట్టేవారు. వాళ్ళింట్లో ఆవకాయ బావుంటుంది. వాళ్ళ అబ్బాయిని చేసుకుంటా అని ఎనిమిదో క్లాసులో డిసైడ్ అయిపొయా!

పెళ్ళయ్యేదాకా మా ఆయనకి లంచ్ టైంలో ఆఫీసుకి ఓ అవ్వ గంపలో పెద్ద క్యారేజీ పెట్టుకుని తీసుకెళ్ళేదిట. పెళ్ళయ్యాకా ఆయనకి చిన్న టిఫిన్‌బాక్స్ ప్రొద్దుటే ఇచ్చి పంపేదాన్నిట.. మా పిల్లలకి ఇప్పటికీ చెప్పి వాపోతుంటారు.

చాలా మంది మగాళ్ళ బతుకులు ఇంతే.

అసలు చిన్నతనంలో సాయంత్రం భోజనాల 'మెనూ' వేరే ఉండేది. అమ్మమ్మ సాయంత్రాలే పాతోళీ చేసేది సెనగపప్పు రుబ్బి, ఏ గోరు చిక్కుడు కాయతోనో, అరటి కాయతోనో! నానిన పెసరపప్పు, ఎండుమిర్చి, జీలకర్రా ఇంగువతో రుబ్బి అన్నంలోకి పెసరట్లు వేసేది. అప్పడాల పిండీ, కందిపచ్చడీ, వంకాయ కాల్చి పులుసు పచ్చడీ, చారూ, నిప్పుల మీద కాల్చి నూనె రాసిన మినప అప్పడాలూ, దోస వరుగులూ, దొండ వరుగులూ, బూడిద గుమ్మడికాయతో పచ్చివడియాలూ, పచ్చిపులుసూ, మెంతి మజ్జిగా, ములక్కాడ వేసి చారూ, నిమ్మకాయ చారూ, కందట్టూ, చామకూర వడలూ, పెసర పుణుకులు వేసిన మజ్జిగ పులుసూ, అరటి దూట పెరుగు పచ్చడీ, పిండి వడియాలూ, చింతపండు పచ్చడీ... ఇలాంటివన్నీ ప్రొద్దుట పూటకాదు సాయంత్రం పూట వంటలు. ఇంక మజ్జిగన్నంలో మాగాయ టెంక వేసుకుని నాకుతుంటే టైమే తెలిసేది కాదు.

ఇప్పుడు ఎవరింట్లోనూ సాయంత్రం 'అన్నాలు' లేవు. పాపం. గోధుమ అన్నం, వ్రలూ, వోట్స్, పుల్కాలూ, గోధుమ గడ్డీ.. ఎక్సెట్రా!

గుండమ్మ కథ సినిమాలో రమణారెడ్డిని "పాలల్లో నీళ్ళు కలుపుతున్నావ్ గరటయ్యా" అంటే,

"నీళ్ళు కలపకుండా తాగి అరాయించుకునే మగాడెవరు ఈ రోజుల్లో" అంటాడు. అలా మేం తిన్న తిండ్లు తిని అరాయించుకునే పిల్లలున్నారా ఈ రోజుల్లో.

మా బామ్మ ఎనభై ఏళ్ళు వచ్చేదాకా, సాయంత్రం పలహారం తిని, మళ్ళీ రాత్రికి సుష్టుగా అన్నం తిని బలంగా ఉండేది. నువ్వుండలూ, పల్లి పట్టీ, కరకజ్జం, మిరపకాయ బజ్జీలూ అన్నీ తిని జీర్ణం చేసుకునేది.

మోడీగారి పుణ్యమా అని అందరికీ మూడొందల ముప్పై రూపాయలకి ఇన్సూరెన్స్ చేయిస్తున్నారుగా! మా ఆడబిడ్డ నిన్న నాకు ఫారాలు తెచ్చి ఇస్తూ "రెండు లక్షలొస్తాయి.. అసలే అస్తమానం విమానాలలో తిరుగుతుంటావ్.. ఇన్సూరెన్స్ చెయ్యి" అంది.

ఇన్సూరెన్స్ చెయ్యడానికి విమానంలో తిరగక్కర్లేదు. మన ఆనంద్‌బాగ్‌లో రోడ్డు దాటడం చాలు... అని సంతకాలు చేసా.

అప్పట్లో శుచిగా శుభ్రంగా ఇళ్ళల్లో వండుకు తిని మన పెద్దవాళ్ళు గొప్ప గ్యారంటీగా బ్రతికేవారు. ఇప్పట్లా పాచిపోయిన పిజ్జాలూ, రసాయనాలు వేసిన మేగీ నూడిల్స్ తెలీవుగా.

కమ్మగా వేయించి వండిన ముద్దపప్పులో, వెన్న కాచిన నెయ్యి, ఎర్రటి అమృతంలాంటి ఆవకాయా కలుపుకుని తింటే.. అమృతంరుచి ఎలా ఉంటుందో తెలుస్తుంది.

ఓసారి నేనూ, అమ్మా గౌహతీ వెళ్తుంటే, సెనగపప్పు ఉడకపెట్టి, పసుపూ ఉప్పూ వేసిన కూరా, ఆవ నూనెలో చేసిన చపాతీలూ తప్ప దొరకని చోట.. ఒకావిడ కేన్‌లోంచి ఎర్రటి ఆవకాయ అన్నం తీసి పిల్లలకి పెడ్తుంటే, నా నోరు ఎంత ఊరిపోయిందంటే, నాకూ ఓ ముద్ద పెడితే బావుండ్ను.. సిగ్గు విడిచి అడిగేద్దునా అనిపించింది. అయినా ఆవకాయ దగ్గర సిగ్గేవిటండీ తెలుగు గడ్డ మీద పుట్టి..

**ఆంధ్రమాత గోంగూర అయితే.. ఆంధ్రాపిత ఆవకాయ!**

**జయహో ఆవకాయ! జై జయహో మాగాయ!**

Post your comments

